క్లుప్తంగా

రామతీర్థంలో లక్ష తులసీ దళార్చన



స్వామి సన్నిధిలో లక్ష తులసీ దళార్చన జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి కల్యాణ వసంతోత్సవాలను పురస్కరించుకొని స్వామికి లక్ష తులసీ దళార్చనను అర్చకులు మంగళవారం వైభవంగా జరిపించారు. వేకువజామున మంగళశాసనం, తీర్థగోష్ఠి నిర్వహించిన తరువాత సీతారామ స్వామి సన్నిధిలో శ్రీమద్రామాయణ, సుందరాకాండ పారాయణాలు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం లక్ష తులసీ దళార్చన, కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా కొనసాగించారు. యాగశాలలో గాయత్రీ రామాయణం, సంక్షేమ రామాయణం, సుందరాకాండ హవనం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం వద్దు.. ఆరోగ్యం ముద్దు..



మద్యం షాప్ వద్ద అవగాహన కల్పించి ఆర్థిక వితరణ అందజేస్తున్న మాజీ ఆర్మీ ఉద్యోగులు

నెల్లిమర్ల: మద్యం వద్దు.. ఆరోగ్యం ముద్దు.. అంటూ మాజీ ఆర్మీ ఉద్యోగులు అవగాహన కల్పించారు. స్థానిక రామ తీర్థం జంక్షన్ మద్యం షాపు వద్ద గొర్లిపేట, కెల్ల గ్రామాలకు చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగులు రామ్మూర్తి, సారిక అప్పారావు మద్యం వద్దు.. ఆరోగ్యం ముద్దు అంటూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మద్యం దుకాణానికి వచ్చి మద్యం తాగకుండా వెళ్లిన వారికి సుమారు రూ.30వేలు వితరణగా అందజేసి వినూత్న కార్యక్రమం నిర్వహించారు.


యువతకు స్ఫూర్తి భగత్‌సింగ్



మాట్లాడుతున్న నవయువ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు అప్పలరాజు

విజయనగరం గంటస్తంభం: పాలకుల విధానాలపై, సామ్రాజ్యవాద దోపిడి పీడలకు వ్యతిరేకంగా పోరాడిన వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ అని ఎన్‌వైఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.అప్పలరాజు అన్నారు. మంగళవారం నవయువ సమాఖ్య ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల దురగతాలను వ్యతిరేకిస్తూ స్వయం పాలన సాధించాలని తిరుగుబాటు జెండాను ఎగరవేసి స్వాతంత్ర పోరాటంలో యువకులకు ఉరి తొలగించిన వ్యక్తి భగత్ సింగ్ అని గుర్తు చేశారు. సోషలిస్టు వ్యవస్థ లేని దోపిడి రహిత సమాజం ఏర్పడుతుందని నినదించిన వ్యక్తి భగత్ సింగ్ అని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ ఆధునికీకరణకు చర్యలు



షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలను ఖాళీ చేయిస్తున్న అధికారులు

విజయనగరం: విజయనగరం కార్పొరేషన్‌కు చెందిన విపణి కల్ప షాపింగ్ కాంప్లెక్స్ ఆధునికీకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే భవనం శిథిలావస్థకు చేరుకోవటంతో అందులో వ్యాపారాలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాంప్లెక్స్‌ను ఆధునీకరించటంలో భాగంగా వ్యాపారాలు సాగిస్తున్న వారు ఈ నెల 1లోగా ఖాళీ చేయాలని ఆదేశించారు. దీంతో మంగళవారం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజుతో పాటు రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో షాపులను ఖాళీ చేయించారు. అందరి సమ్మతితో కాంప్లెక్స్ ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.

బ్రిడ్జి కోర్సులు సద్వినియోగం కావాలి

చీపురుపల్లి: పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం బ్రిడ్జి కోర్సులను ప్రారంభించామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ మద్దలి వినోద్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం నుంచి ద్వితీయ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న విద్యార్థులు తప్పనిసరిగా ఏప్రిల్ 23 వరకు కళాశాలకు రావాలని సూచించారు. గణితం, ఇంగ్లిష్‌తో పాటు ఆర్ట్స్ గ్రూపులు వారికి కూడా బ్రిడ్జి కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, ల్యాబ్ రికార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

వసూలైన ఆస్తిపన్ను రూ.33.96 కోట్లు

- మొత్తం డిమాండ్‌లో పెండింగ్‌లో ఉన్నది- రూ.18.05 కోట్లు
- ప్రభుత్వ శాఖల భవనాల డిమాండ్ రూ.30.55కోట్లు..
- వసూలు రూ.1.93 కోట్లు
- ముగిసిన ఆర్థిక సంవత్సరం గడువు



నగరంలోని భవన సముదాయాలు

వడ్డీ భారం మోయక తప్పదు

నగరం అభివృద్ధి చెందాలంటే పన్నుల ద్వారా వచ్చే ఆదాయమూ ముఖ్యమే. చాలా మంది పన్ను మొత్తం చెల్లించేందుకు ఆసక్తి కనబరచడం లేదు. సకాలంలో పన్నులు చెల్లిస్తే వారిపై వడ్డీ భారం ఉండదు. నిర్లక్ష్యంగా ఉన్న వారు భవిష్యత్‌లో ఎప్పటికైనా వడ్డీతో కలిపి చెల్లించాల్సి వస్తుందన్న విషయాన్ని గుర్తించుకోవాలి. – పల్లి నల్లనయ్య, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

విజయనగరం: స్థానిక సంస్థల అభివృద్ధి పన్నుల రూపంలో వచ్చే ఆదాయంపైనే ఆధారపడి ఉంటుంది. ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రూపాల్లో నిధులు మంజూరు చేస్తున్నా... స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఖజానాను నింపుకోవడం స్థానిక సంస్థలకు కీలకమనే చెప్పాలి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సార్వత్రిక ఎన్నికల సమయంలో విజయనగరం కార్పొరేషన్‌కు 52.73 శాతం ఆదాయం ఆస్తి పన్నుల రూపంలో వసూలు కాగా... ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 65.32 శాతం సమకూరింది.

కార్పొరేషన్ పరిధిలో ఇదీ పరిస్థితి

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 70,273 అసెస్‌మెంట్‌లు ఉండగా... వాటి ద్వారా ఆస్తిపన్ను రూపంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.31.89 కోట్ల ఆదాయం పన్నుల రూపంలో రావాల్సి ఉండగా... రూ.27.33 కోట్లు వసూలైంది. రూ.4.56 కోట్లు బకాయిగా మిగిలిపోయాయి. అలాగే, గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో వసూలు కాని మొండి బకాయిలు రూ.20.04 కోట్లు ఉండగా... కేవలం రూ.6.59 కోట్లు వసూలు చేశారు. మరో రూ.13.45 కోట్లు వసూలు కావాల్సి ఉంది. పాత, కొత్త బకాయిలు కలిపి మొత్తం రూ.33.96కోట్లు (65.32 శాతం) ఆస్తి పన్నులు వసూలు చేయగలిగారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 6 రోజులు ఉందన్న సమయంలో 50 శాతం వడ్డీ రాయితీని మున్సిపల్ శాఖ ప్రకటించినప్పటికీ ఆ ప్రభావం అంతగా కనిపించలేదనే చెప్పాలి.

ప్రభుత్వ భవనాల నుంచి వసూలు కాన్ని పన్నులు

సామాన్య ప్రజల నుంచి ముక్కుపిండి మరీ పన్నులు వసూలు చేస్తున్న అధికారులు ప్రభుత్వ భవనాల నుంచి ఆస్తి పన్ను రూపంలో రావాల్సిన ఆదాయంపై నిర్లక్ష్యం నటిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం నగరంలో 163 వరకు ప్రభుత్వ భవనాలు ఉండగా వాటి ద్వారా పాత బకాయిలు రూ.28.16 కోట్లు, గత ఆర్థిక సంవత్సర బకాయి రూ.1.93 కోట్లు రావాల్సి ఉంది. అయితే కార్పొరేషన్ అధికారులు మాత్రం కేవలం రూ.1.29 కోట్లు మాత్రమే వసూలు చేశారు. మరో రూ.29.25 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. ఏటేటా సక్రమంగా పన్నులు చెల్లించకపోవడంతో బకాయి మొత్తం పెరిగిపోతుంది.

మొండి బకాయిలపై దృష్టి సారించేనా?

గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన సచివాలయ వ్యవస్థతో పన్నుల వసూళ్లు మెరుగుపడ్డాయి. 2022-23 సంవత్సర వరకు ఆశించిన స్థాయిలో పన్నులు వసూలు జరిగినప్పటికీ అనంతరం వచ్చిన ఆర్థిక సంవత్సరాల్లో పేరుకుపోయిన మొండి బకాయిల వసూళ్లలో యంత్రాంగం విఫలమవుతోంది. దీంతో ఆస్తి, నీటి పన్నులతో పాటు ఖాళీ స్థలాల నుంచి వసూలు కావాల్సిన మొత్తం రూ.కోట్లలో బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కల వెల్లడిస్తున్నాయి. పేరుకుపోయిన బకాయిలు రాబడితే నగరంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది.

స్మార్ట్ మీటర్ల బిగింపును తిప్పికొట్టాలి



పోస్టర్‌ను ఆవిష్కరించిన సీపీఎం కార్యవర్గ సభ్యులు

విజయనగరం గంటస్తంభం: ప్రజలపై భారాలు వేసేలా స్మార్ట్ మీటర్లను అమర్చుతున్నారని, దీన్ని తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు కోరారు. 'స్మార్ట్ మీటర్ మా ఇంటికి వద్దు' అనే పోస్టర్‌ను మంగళవారం 46వ డివిజన్ ఎల్బీజీ నగర్‌లో జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీతో చేసుకున్న సెకీ ఒప్పందం వల్ల ప్రజలపై విపరీతమైన భారం పడుతోందని ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. స్మార్ట్ మీటర్ల పగలగొట్టండి అని పిలుపునిచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మార్చి అవే స్మార్ట్ మీటర్ల ప్రతి ఇంటికి బిగించడానికి రంగం సిద్ధం చేయడం దుర్మార్గమన్నారు. ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చానని అప్పట్లో చెప్పిన పవన్‌కల్యాణ్ నేడు నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్ల విధానం తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో విద్యుత్ ఉద్యమానికి నాంది పలుకుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, బి.రమణ, రేవరాజు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సైరన్‌తో షిఫ్ట్‌ల వారీగా మిల్లు తిప్పాలి

నెల్లిమర్ల: జ్యూట్ మిల్ సైరన్ వేసి షిఫ్టుల వారీగా మిల్లు తిప్పాలని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద కార్మికులనుద్దేశించి మంగళవారం ఆయన మాట్లాడారు. జ్యూట్ యాజమాన్యం లాకౌట్ తరువాత మిల్ నిర్వహణ పనులు ముగించి ఉత్పత్తి ప్రారంభించిందన్నారు. అయితే సైరన్ వేయకుండా పాడి కూలి పేరిట మిల్లు తిప్పడం దారుణమన్నారు. ముఖ్యంగా పాడి కూలికి మిల్లు తిప్పితే కార్మికుల సిక్ లీవ్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి జ్యూట్ యాజమాన్యం సైరన్ వేసి షిఫ్టుల వారీగా ఎ, బి, సి గ్రూపుల వారీగా మిల్లు తిప్పాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా జ్యూట్ చర్చల్లో లేబర్ కమిషనర్ వద్ద చేసుకున్న ఒప్పందం ప్రకారం మిల్లు తిప్పి ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలు ప్రభుత్వానికి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు క్రమశిక్షణతో మెలిగి నిర్లక్ష్యం వహించకుండా ఉత్పత్తి అందించి మిల్లును కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా అండగా నిలిచి పోరాటం చేస్తానని భరోసా ఇచ్చారు.

కూటమి నేతల ఆధిపత్య పోరు!

- నియామకం జరగని పూసపాటిరేగ ఏఎంసీ పాలకవర్గం
- కమిటీలో ఏడుగురు ఉద్యోగులకుగాను ఇద్దరితోనే నిర్వహణ
- జిల్లాలో అధిక ఆదాయం ఈ ఏఎంసీదే..



పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

పూసపాటిరేగ: పూసపాటిరేగ ఏఎంసీ పాలకవర్గం నియామకంపై ఆధిపత్య పోరు కమ్ముకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 45 మార్కెట్ కమిటీల పాలక వర్గాల నియామకాన్ని ప్రకటించిన కూటమి సర్కారు పూసపాటిరేగ ఏఎంసీ నియామకంపై తాత్సారం చేస్తుంది. ఇక్కడి ఎమ్మెల్యే జనసేన కావడం ఆశావాహులు సంఖ్య టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి ఎక్కువగా వుండటం తదితర కారణాలతోనే తొలి జాబితాలో పూసపాటిరేగ మార్కెట్ కమిటీ పేరు లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గం లేకపోవడంతో నిర్వహణ గాడి తప్పుతోంది. ఏఎంసీలో సిబ్బంది కొరత వుండటంతో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. జిల్లాలోనే అత్యధికంగా ఆదాయం వస్తున్నప్పటికి రైతులకు సేవలు అందించడంలో విఫలం అవుతోంది. కమిటీలో ఏడుగురు సిబ్బంది ఉండాల్సి ఉండగా ఒక కార్యదర్శి, సూపర్‌వైజర్‌తోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఏఎంసీ పాలకవర్గం లేకపోవడంతో కమిటీ నిర్వహణ పక్కదారి పడుతోంది. మార్కెట్ కమిటీ పాలనా వ్యవహారాలు చూడాల్సిన పోస్టులు ఖాళీ వుండటంతో ఆదాయం తగ్గుతోంది. మార్కెట్ కమిటీ పరిధిలోని రాజాపులోవ, నాతవలస చెక్‌పోస్టులలో మార్కెట్ కమిటీ సిబ్బంది లేకపోవడంతో కేవలం సెక్యూరిటీ గార్డులతోనే నిర్వహిస్తున్నారు. దీంతో కమిటీకి వచ్చిన ఆదాయంపై పర్యవేక్షణ లేదనే విమర్శలు వున్నాయి. పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాలకు చెందిన ప్రజలకు సేవలు అందించాల్సిన పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గడిచిన మూడేళ్లలో ఏఎంసీ ఆదాయ లక్ష్యం, వచ్చిన ఆదాయ వివరాలు

సంవత్సరం	లక్ష్యం	వచ్చిన ఆదాయం
2022-23	రూ.1.20 కోట్లు	రూ.1.40 కోట్లు
2023-24	రూ.1.61 కోట్లు	రూ.1.62 కోట్లు
2024-25	రూ.1.67 కోట్లు	రూ.1.69 కోట్లు

ఫిరంగి కొండను తవ్వేస్తున్నారు..

- సెలవు రోజు వస్తే.. రెచ్చిపోతున్న అక్రమార్కులు
- ఇష్టారాజ్యంగా గ్రావెల్ తరలింపు
- ఆపై చదును చేసిన జాగా ఆక్రమణ



కొత్తవలస పంచాయతీ పరిధిలో ఫిరంగ కొండను తవ్వేస్తున్న అక్రమార్కులు

కొత్తవలస : మండల కేంద్రం గిడిజాల రోడ్డు సమీపంలో గల ఫిరంగి కొండను కొందరు అక్రమార్కులు అదే పనిగా తవ్వేస్తున్నారు. జేసీబీలు పెట్టి కొండను రెండు వైపుల నుంచి తవ్వుకుంటూ పోతున్నారు. ఈ క్రమంలో కొండపై ఉన్న రకరకాల చెట్లు నేలకూలుతున్నాయి. ముఖ్యంగా సెలవు రోజులొస్తే అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజున జేసీబీ, ట్రాక్టర్లు ఆ కొండపై వాలిపోతున్నాయి. వీటి సాయంలో కంకర, రాళ్లు తవ్వేసి అక్రమంగా తరలించేస్తున్నారు. మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న దీని పరిస్థితే ఇలా ఉంటే మిగతా ప్రాంతాల్లోని కొండల పరిస్థితి ఏంటన్నది అధికారులే తేల్చాలి. కూటమి పాలనలో తమను అడిగే వాడే లేడంటూ అక్రమార్కులు ఇష్టారాజ్యంగా కొండను తవ్వేస్తున్నారు. అధికారులు అప్పుడప్పుడు సమాచారం తెలిసి అక్కడికి వెళ్తే. కూటమి నాయకుల హుకుంలతో వెనక్కి వచ్చేస్తున్నారు. దీంతో రెవెన్యూ అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోక చెక్క మాదిరి తయారైంది. పచ్చని కొండ మంచు కొండలా తరిగిపోతున్నా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఈ అక్రమాలను చూసి పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన అధికారులు కళ్లు మూసుకుని కూర్చుంటున్నారని విమర్శిస్తున్నారు.

జాగా ఆక్రమణ

కొండను తవ్వేసిన తరువాత ఆ ప్రాంతాన్ని చదును చేస్తున్న ఆక్రమణదారులు ఆ స్థలాన్ని ఆక్రమించేస్తున్నారు. ఒక ప్రణాళిక ప్రకారమే ఇదంతా జరుగుతుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. తవ్వేసిన కొండ ప్రాంతంలో ముందుగా చిన్న షెడ్లు వేసి.. తరువాత భవనాలను నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాలపై రాజకీయ నేతల ఒత్తిళ్లు ఉండడంతో అధికారులు నోరు మెదపలేకపోతున్నారు. ఇదే విషయమై మండల రెవెన్యూ అధికారి రాజేష్ వద్ద సాక్షి ప్రస్తావించగా సెలవు రోజుల్లో తవ్వకాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ తవ్వకాలపై దృష్టి సారిస్తామని, విడిచిపెట్టేది లేదన్నారు. ఈ తవ్వకాలపై మైనింగ్ అధికారులు కనీసం దృష్టి సారించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన

కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ విజయనగరం కార్పొరేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్మోహనరావు, బి.భాస్కరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళశారం విజయనగరం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, నేరుగా మున్సిపాలిటీ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. నాయకులు రజిని, కృష్ణకుమారి, రమ, చిన్ని, శంకరరావు, రాఘవ, రామరాజు తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం గంటస్తంభం



మండుటెండలో మోకాలిపై నిరసన

పది రోజులుగా రెల్లి కులస్తులమైన తామంతా రోడ్డున పడి నిరసనలు వ్యక్తం చేస్తుంటే జిల్లా ప్రజాప్రతినిధుల కనీస స్పందన లేకపోవడం తీవ్ర విచారకరమని విజయనగరం జిల్లా రెల్లి సామాజిక వర్గం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. విజనగరంలోని బాలాజీ కూడలి వద్ద మంగళవారం మండుటెండలో మోకాలిపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వర్గ ప్రతినిధులు బంగారు దుర్గారావు, యర్రంశెట్టి వాలి, శ్రీను తదితరులు మాట్లాడుతూ కుల గణన చేసే జరిగే వరకూ ఎస్సీ వర్గీకరణ ఆపాలన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు తక్షణమే జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలన్నారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సామాజిక వర్గ ప్రతినిధులు రమణ, రఘు, రామారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం టౌన్



సుప్రీం కోర్టు తీర్పును ఉల్లంఘిస్తున్న టీడీపీ నేతలు

- కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న అంబేడ్కర్ రైట్స్ ఫోరమ్ ప్రతినిధులు

విజయనగరం: అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు సుప్రీంకోర్టు తీర్పు ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని అంబేడ్కర్ రైట్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు బొంగ భానుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నగరంలో ఆ పార్టీ నాయకులు చేస్తున్న తప్పులపై మంగళవారం కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తెలుగుదేశం పార్టీ 43వ వ్యవస్థాపన దినోత్సవం సందర్భంగా విజయనగరం పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు రోడ్లకు ఇరువైపులా, రోడ్డు మధ్యలో పార్టీ జెండా నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఉన్నత న్యాయ స్థానం తీర్పు మేరకు నగర సుందరీకరణ, ఆధునీకరణలో భాగంగా ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అయితే విజయనగరంలో రోడ్డు మధ్యలో విగ్రహాలు, రాజకీయ పార్టీల నిర్మాణాలు నిర్మిస్తూ ఆ పార్టీ పట్టణ కమిటీ చట్టాన్ని ఉల్లంఘిస్తుందన్నారు. తక్షణమే తెలుగుదేశం పార్టీ జెండా నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గతంలో విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా గల నాలుగు రోడ్ల జంక్షన్‌లో చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహం కూడా పెట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డి.వెంకటేష్, వేమల వంశీ పాల్గొన్నారు.

టీడీపీ వారిని గౌరవించాలంటూ వినతి



ఎంపీడీఓ భవానీకి వినతిపత్రం అందజేస్తున్న నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బంగార్రాజు, మాజీ జెడ్పీటీసీ అప్పలనారాయణ తదితరులు

డెంకాడ: మా టీడీపీ వాళ్లను అధికారులు గౌరవించాలని మండలంలోని ఓ వర్గానికి చెందిన టీడీపీ నాయకుల పేర్లతో కూడిన జాబితాను ఆ పార్టీ నేతలు నెల్లిమర్ల నియోజవర్గ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ ఆధ్వర్యంలో అధికారులకు అందజేశారు. ఎంపీడీఓ, తహసీల్దార్ తదితర మండల స్థాయి అధికారులను మంగళవారం కలిసి ఈ మేరకు టీడీపీ నాయకుల జాబితాను అందజేశారు. ప్రభుత్వ పరంగా గ్రామాల్లో నిర్వహించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఈ జాబితాల్లో ఉన్న నాయకులను కచ్చితంగా ఆహ్వానించాలని వారు అధికారులకు సూచించారు. వినతిపత్రం అందజేసిన వారిలో డెంకాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రాజు తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా వీరు అందజేసిన జాబితాలో వ్యతిరేక వర్గం వారి పేర్లు కూడా ఉండడం చర్చనీయాంశమైంది. ఈ లేఖల అందజేతతో నియోజకవర్గంల టీడీపీ రెండు వర్గాలుగా వర్ధిల్లుతుందని ఆ పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు.

శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుకలు



వందో పుట్టిన రోజున కేక్ కట్ చేస్తున్న ఆచంట శేషకుమారి

డెంకాడ/విజయనగరం అర్బన్: మండలంలోని పెదతాడివాడ పంచాయతీ దయాల్‌బాగ్ కాలనీకి చెందిన ఆచంట శేషకుమారి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని వందో సంవత్సరంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా రాధాస్వామి సత్సంగ సభ్యురాలైన ఆచంట శేషకుమారిని పుట్టిన రోజును సంఘం విజయనగరం బ్రాంచ్ కార్యదర్శి ఎం.ఆనంద్‌కుమార్, సభ్యులు దయాల్‌బాగ్ కాలనీలో నిర్వహించారు. కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. సత్సంగ్ సీనియర్ సభ్యులు మెహతా ప్రసాద్ మాట్లాడుతూ విజయనగరం సత్సంగ్ శాఖకు వందేళ్ల చరిత్ర ఉందన్నారు. వందో పుట్టిన రోజు జరుపుకున్న సత్సంగి ఆచంట శేషకుమారి మాత్రమేనని తెలిపారు. సభ్యులు రామ్‌ప్రసాద్, టి.ఆనంద్, కె.నాగభూషణం పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com